“అదుగో బుద్ధావతారం గారు వస్తున్నారు – బహుపరాక్” అని సరోజ గట్టిగా నవ్వింది.

“ఎవరికి?... ఓహో ఆయనా?... బుద్ధావతారం కాదు- బడుద్ధావతారం.” అన్నది కృష్ణవేణి హేళనగా.

“ఇదేమీ కాలేదువే – కనబడటంలేదూ ఆయన ముద్దిమృగంలాగా అపరనరహోవతారం గారు” అన్నది సరస్వతి వ్యంగ్యంగా.

“ఏమండోయ్ అవతారం గారూ – స్వాగతం-సుస్వాగతం...” అని గొల్లుమని నవ్వారు అక్కడ వున్న యువతు లందరూ.

“ఏమయ్యోయ్ పంతులూ – ఇక్కడ మేము మడివాళ్లం-కొంచెం నిదానించూ... మీ యింట్లో పెళ్లాం పిల్లలు యేడిపిస్తారని గొడవ లేదుగా నీకు” అన్న దొక గంగాభాగీరథి.

“ఈయన అవతారానికితోడు ఒక పెళ్లాం కూడానా” అని మూల విరిచిం దొక ముత్తైదు.

ఇంతమంది స్త్రీల హేళనకు గురైన వ్యక్తి మాత్రం పాపం నోరెత్తి మాట్లాడలేదు. శాంతంగా ఒక మూల నిల్చొనివుండి ఆ కొళ్ళాయివద్దవున్న స్త్రీలందరూ నీళ్ళు పట్టుకొని వెళ్లిపోయిన తర్వాత, తానొక బిందె నీళ్ళు పట్టుకొని వెళ్ళిపోయాడు.

గవర్నర్ పేటలోని ఒక వీధి కొళ్లాయి వద్ద నిత్యసంఘటనలలో యిది ఒకటి. ఆ పేటలోని స్కూల్ టీచర్ మాధవరావు నిత్యజీవితములో కూడా యిది ఒక ఘట్టం.

మాధవరావు యెక్కడివాడో— అతనికి ఆ వా అనేవాళ్ళు వున్నారో లేదో కూడా యెవరికీ తెలియదు. ఎవరో తెలుసుకోలేదు. ఆ పేటలో ఒక చిన్న యింట్లో ఒకగది అద్దెకు తీసుకొని అందులో అతనుంటున్నాడు. ప్రతిరోజు కాలకృత్యా లయినతర్వాత కుళ్ళాయిదగ్గర రెండుబిందెల నీళ్ళు పట్టుకొని వెళ్ళి తానే స్వయంగా వంట వండుకొని స్కూలుకువెళ్ళటం అతని నిత్యకార్యక్రమం. వృద్ధనారీమణులు మొదలు నవయువతులవరకు కుళ్లాయి వద్ద యితనిని హేళనచేస్తూ పూర్తిగా అవమానించిగాని వదిలిపెట్టేవారుగాదు. ఇక స్కూలులో విద్యార్థులతో పాఠ్యవిషయాలు తప్ప యితర వ్యాసంగము చేయకుండా పాఠశాల వదిలినవెంటనే తనగదికి చేరుకొనేవాడు. సహోధ్యాయు లందరికి యితన్ని చూస్తే కొంత నిరాదరణ – హేళన వున్నా యింత భయస్తుడు, అచేతనుడు జీవితంలో ఎలా ముందుకు సాగిపోగలడు' అనే సానుభూతికూడా కొంత వుండేది.

మాధవరావు స్వభావములాగానే అతని జీవితంకూడా చాల మందంగానే సాగిపోతోంది. ఏకాకి జీవితంసాగిస్తూ తనకువచ్చే స్వల్ప వేతనంతో కాలం గడుపుకుంటున్న తనయందు యిరుగుపొరుగువారు చూపుతున్న నిరాదరణ, అపహాస్యము సహించటం అతనికి పోను పోనూ దుర్భరము కాజొచ్చింది. ముఖ్యంగా ఆ వీధిలోని యువతులు యితని యెడ అవలంబించిన వైఖరి యితనికి చాల బాధాకరంగా పరిణమించింది. ఇతనువీధిలో కనబడి నప్పుడల్లా వారు యేదో ఒకరూపంలో యితనిని విసిగిస్తుండేవారు. సహజంగా అనాకారి కాకపోయినా నీరుకావి పట్టి మాసినట్లు వుండే బట్టలు, తైల సంస్కారము లేని శిరోజాలు అతని ఆకారానికి అసహ్యత కలుగ జేస్తుంటాయి. నిరాడంబరమని [illegible] కోనేందుకు వీలులేనంతటి మడ్డితనమువల్లనే అందరూ తనవంతగా ఏవగించుకుంటున్నారని అతను తెలుసుకోనలేకపోయాడు.

కుటుంబశాస్త్రిగారు ఆ పేటలోనే వుండే సంస్కృతపాఠశాలలో పండితుడుగా వుంటున్నారు. ఆయన కుమార్తె పార్వతి మాత్రము మొదటినుండి మాధవరావును ఒకవిధమైన సానుభూతి దృష్టితో చూస్తుండేది. ఇతని అమాయకత్వము, విసన్నహోయస్థితి చూచి ఆమె జాలిపడేది. ఆ వీధిలోని యువతులు అతనిని విసిగిస్తున్నప్పుడు యీమె చూస్తే వారిని వారింప ప్రయత్నించేది. కాని వారు యీమెనుకూడా ఆటలు పట్టించేవారు.

పార్వతి ఫోర్త్‌ఫారం చదువుతుండగా ఆమెతల్లి మరణించింది. అక్కడితో ఆమె చదువుకు స్వస్తి చెప్పి కుటుంబనిర్వహణ భారాన్ని వహించవలసి వచ్చింది. తమ్ముడు రామశాస్త్రికి చదువు సంధ్యలలో తోడ్పడుతూ, గృహకృత్యములను నేర్పుతో నిర్వహిస్తూ తండ్రికి సహాయంగా వుండేది. ఆమె అసాధారణ రూపవతి కాకపోయినా

శాంతి సహనాలతో విలసిల్లే ఆమె హృదయ సౌందర్యమే ఆమె సహజశోభను ద్విగుణీకృతంచేసింది. బాల్యమునుండి కొంత కష్టములో గడుపుతూ వుండటముచేత యితరుల బాధలను సానుభూతితో చూసే సుగుణ మామెకు బాగా అలవడింది.

ఒకరోజున ఆమె తమ్ముడితో "రామం, మన వీధిలోవుండే మాధవరావుగారు యెక్కడ వుద్యోగముచేస్తున్నారో నీకు తెలుసా?" అని అడిగింది.

"తెలియకేం......ఆయన మా స్కూలులోనే టీచరుగా వుంటున్నారు. కాని మాక్లాసుకు మట్టుకు రారు" అన్నాడు రామం.

"ఏమిటీ? ఆయన టీచరా? మరి స్కూలులో కూడా యిలాగే వుంటారా?"

"ఇలాగే వుంటారు. కాని ఆయన పద్యాలు అవి ఎంతచక్కగా చెప్పుతారనుకున్నావు. చాలా చక్కగా పాడ్తారు కూడాను." అన్నాడు రామశాస్త్రి.

"నీకెలా తెలుసు?" అని అడిగింది పార్వతి.

"ఈమధ్య మా తెలుగుమాష్టరుగారు రాలేదు. అందుకని మాధవరావుగారు వచ్చారు. మా మేష్టరుగారికంటే బాగా అర్థమయ్యేటట్లు చెప్పి కమ్మనిగొంతుకతో కొన్ని పద్యాలు చదివితే మాకు ఆశ్చర్యం వేసింది. ఆయన స్వయంగా కవిత్వంకూడా చెప్తారట," అన్నాడు రామం.

"అయితే నీకు ఆయనతో పరిచయం లేదా?" అన్నది పార్వతి.

"లేదు. కాని నాకు ఆయనదగ్గర కవిత్వం చెప్పుకోవాలని వుంది. ఏమంటావు" అని అడిగాడు.

"చెప్పుకో. అందులో తప్పేముంది?" అని పార్వతి సమ్మతి తెలిపింది.

తర్వాత రామంమాధవరావుతో పరిచయం చేసుకొని ఆయనవద్దకు వెళ్ళటం మొదలుపెట్టాడు. క్రమంగా వారిద్దరికీ బాగా స్నేహం ఏర్పడది. ఆయనదగ్గర తాను చెప్పుకున్నవన్నీ తండ్రికీ, పార్వతికీ తెలుపుతేవాడు.

కొన్నాళ్ళయినతర్వాత కుటుంబశాస్త్రిగారు మాధవరావు గదిదగ్గరకు వెళ్ళారు. అప్పుడు అతను ఏదో రాసుకుంటూ కూర్చున్నాడు. శాస్త్రిగారు లోపలకువెళ్ళి "మాధవరావుగారు మీరేనాండి" అని అడిగారు.

తొట్రుపాటుతో మాధవరావు లేచి "అవునండి" అన్నాడు.

"మా అబ్బాయి రామశాస్త్రి మీదగ్గరకొస్తుంటాడుగదండీ?" అన్నారు శాస్త్రిగారు.

మాధవరావు కొంచెం భయంతో "అవునండి. కాని నాలుగైదురోజులనుండి యిక్కడకు రావడంలేదండి" అని జవాబిచ్చాడు.

"అదేనండి. ఆసంగతి చెప్దామనేవచ్చాను. వాడికి ఐదారురోజులనుంచి జ్వరము వస్తున్నది. మీ దగ్గరకు రాలేకపోయానని విచారిస్తున్నాడు. మీకు వీలుంటే ఒకమారు అతనిని చూసేందుకు మాయింటికి వస్తారా?" అన్నారు శాస్త్రిగారు.

కుటుంబశాస్త్రిగారితో మాధవరావు రామాన్ని చూసేందుకు వెళ్ళాడు. అతన్ని చూడగానే రామానికి యెంతో సంతోషం కలిగింది. అతను రామంతో మాట్లాడుతుండగా పార్వతి అక్కడకు వచ్చింది. శాస్త్రిగారు ఆమెను మాధవరావుకు పరిచయంచేస్తూ "ఈమె మా అమ్మాయి పార్వతి," అన్నాడు.

"అలాగా" అన్నాడు మాధవరావు తల పైకెత్తకుండానే.

"ఫోర్త్ ఫారం ప్యాసయింది. ప్రస్తుతం యింట్లోనే వుంటున్నది."

"అలాగా" అన్నాడు మాధవరావు.

"సంస్కృతమంటె చాల యిష్టం. రఘువంశం, మేఘసందేశం-కాళిదాస శాకుంతలం మొదలైన గ్రంథాలు చదివింది" అన్నారు శాస్త్రిగారు.

"అలాగా" అన్నాడు మాధవరావు మళ్లా.

"కావ్యాలన్నా, నవలలన్నా, కథలన్నా చాల యిష్టం. ఎప్పుడూ ఏదో వకటి చదువుతూనే వుంటుంది.

"అలాగా" అన్నాడు మాధవరావు నేల మీదినించి దృష్టి తియ్యకుండానే. పార్వతికి మాధవరావు ఏక పద సమాధానానికి చాల నవ్వొచ్చింది. అతని మౌన స్వభావాన్ని చూసి చాల ఆశ్చర్యపడ్డది. తర్వాత యెన్నాళ్ళవరకో అతని యీ 'అలాగా' అనే వాక్యం ఆమె చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే వుండేది.

మాధవరావు తమ యింటికి వచ్చికూడా తన వైపు ధైర్యంగా తలెత్తి చూడలేకపోయాడు. తర్వాత ఒకటి రెండుసార్లు తమ యింటిమీదుగా వెళ్తుండగా తానే అతనిని పలకరించింది. అతను బెదురుతూనే సమాధానమిచ్చి తలవంచుకొని వెళ్ళిపోయాడు. ఇంత అమాయక వ్యక్తిమీద ఆమెకు యీమారు నిజంగానే జాలేకాక ఒక విధమైన అనురాగంకూడా కలిగింది.

స్త్రీ సహజమైన కారుణ్యం ఆమెలో నిద్రాణమైవున్న ప్రేమభావాన్ని జాగృతం చేసింది. ప్రేమ-ఆదరణ లేక నిరాశా వాతావరణంలోవున్న అతని శుష్కజీవితాన్ని వికసింపచేయాలనే దృఢ

రాళ్లలోని రత్నం

-ంకల్పము ఆమెలో కలిగింది.

* * *

ఆదివారం సెలవు కావటంవల్ల మాధవరావు తన గదిలోనే పడుకొని ఏదో చదువుకుంటున్నాడు. ఇంతలో తలుపుమీద మెల్లిగా యెవ్వరో తటిన శబ్దము విని లేవకుండానే "ఎవరూ?" అని అడిగాడు.

"నేనే" అనే కంఠస్వరం బైటనుంచి వచ్చింది. ఆ "నేను" అనేది ఎవరైంది తెలియక తను లేచివెళ్ళి తలుపు తెరిచాడు.

అతని యెదురుగా శాస్త్రిగారి కుమార్తె పార్వతి నిలచివుంది. అతను చాలా సిగ్గుపడ్డాడు-కొంచెం ఖంగారుకూడా పడ్డాడు. ఏం మాట్లాడాలో తెలియక తలవంచుకొనే "మీరా?" అనిమాత్రం అనగలిగాడు.

"ఆ-అవును నేనే" అన్నది పార్వతి ధైర్యంగా లోపలికివస్తూ అతని యీ ఖంగారును చూచి నవ్వుకుంటూ.

మాధవరావు అగమ్యగోచరస్థితిలో పడిపోయాడు. సామాన్యంగా కొత్తవాళ్ళతో-అందులో ముఖ్యంగా స్త్రీలతో-మాట్లాడేందుకే తగని బిడియపడే అతను యిప్పుడు ఒంటరిగా ఒక యువతితో ఎలా సంభాషణ సాగించాలో బోధపడక ఆమెవంక బెదురుచూపులు చూస్తూ నిల్చుండిపోయాడు. అతని స్థితి పార్వతి వెంటనే గ్రహించింది.

"మాష్టరుగారూ మీతో పనుండి వచ్చాను. మీకిప్పుడేమైనా తీరిక వుంటుందా?" అని నవ్వుతూ అడిగింది.

"నాతోనా?...పనా?...తీరికా?...ఎందుకూ?...నాకు...ఆ... వుంటుంది...వుందిలెండి..." అని ఖంగారుగా అస్పష్టంగా గొణుగుతూ జవాబిచ్చాడు.

ఇతని గాబరాచూసి పార్వతి వస్తున్న నవ్వును బలవంతంగా ఆపుకుంటూ "ఎందుకు మాష్టరుగారు మీ రంత ఖంగారుపడ్తారు? నేను మీకంటె చిన్నదాన్నేగా" అన్నది.

ఏమి సమాధానమీయాలో తెలియక మాధవరావు అమాయకంగా "మీరు నా గదిలోవుండగా యెవరైనా చూస్తే..." అన్నాడు.

"మరేం పరవాలేదండీ — మీరాభయం ఏమీ పెట్టుకోవద్దు. మీవల్ల ఎవరికీ ఏమీ ప్రమాదం జరగదని అందరికీ ధైర్యమే. అందుకనే నేను మీదగ్గర పాఠం నేర్చుకోవాలని వచ్చాను. నేనిప్పుడు "మేఘసందేశం" చదువుతున్నాను. నాకందులో కొన్ని శ్లోకాలు సరిగా తెలియటంలేదు. మా నాన్నగారి నడిగితే వారికి తీరిక లేదని మిమ్మల్నడిగి తెలుసుకోమన్నారు. మీకు శ్రమ లేకపోతే నాకు వాటికి అర్థాలు చెప్తారా?" అని వినయంగా అడిగింది.

ఇప్పటికి మాధవరావు భయం కొంతవరకు తీరిపోయింది. "అలాగే చెప్తాలెండి—మీరు నిల్చొనేవున్నారు. కూర్చోండి" అన్నాడు. కాని యెక్కడకూర్చోవాలో చూపెందుకు వీలులేకుండా వున్నది ఆ గది. అతని ఆకారానికి తగ్గట్టుగానే ఆ గదికూడా ఒక తీరూ తెన్నూ లేకుండావున్నది. సరిగా వూడ్చి యెన్నాళ్ళో అయినట్లున్నది. ఎక్కడ చూసినా దుమ్ము—సాలీడుగూళ్ళు బూజు-మాసిపోయిన గుడ్డలు-పనికిరాని కాగితాలు, వస్తువులు యివన్నీ యెక్కడివక్కడ పడివుండి ఒక శిథిలపత్రంలాగా వున్నది. తన మంచంమీద గందరగోళంగా పడివున్న గుడ్డలన్నీ ఒక మూలకు తోసి తువ్వాలతో దాని నాశ్రయించిన దుమ్మును దులిపి ఆమెను కూర్చోమన్నాడు. ఇదంతా పార్వతి మాట్లాడకుండా చూస్తూనేవున్నది. అతను కూడా ఒక కుర్చీపీట తెచ్చుకొని కూర్చొని ఆమె కోరిన శ్లోకాలకన్నిటికి చక్కగా అర్థాలుచెప్పాడు. ఆమె యెంతో శ్రద్ధగా నేర్చుకొని వెళ్ళిపోయింది.

నాలుగైదురోజుల కొకసారి పార్వతి మాధవరావు గదికివచ్చి సంస్కృత పాఠాలు నేర్చుకొని వెళ్తుండేది. క్రమంగా అతనికి పార్వతిదగ్గర బిడియం తగ్గి కొంత చనువు యేర్పడ్డది. పార్వతి వచ్చినప్పటినుండి అతనిలో కొంత మార్పు కనపడసాగింది. ఒకసారి పార్వతి వచ్చి ఆ గదినంతా శుభ్రంగా ఊడ్చి, బూజుదులిపి పనికిరాని వస్తువులను తీసేసి యెక్కడి సామానులక్కడ చక్కగా అమర్చింది. శాస్త్రిగారు కూడా అప్పుడప్పుడు మాధవరావు వద్దకు వచ్చి కొంతసేపు కాలక్షేపంచేసి వెళ్తుండేవారు. క్రమంగా ఆ కుటుంబంవారితో మాధవరావుకు బాగా సన్నిహిత స్నేహమేర్పడింది. రామం పార్వతి సూచనమీద మాధవరావు బట్టలు తీసుకొని వెళ్ళి శుభ్రంగా యిస్త్రీ చేయించి యిచ్చాడు. శుభ్రంగా తల దువ్వుకొని మంచి బట్టలు ధరించి వెళ్తుండే మాధవరావును పిల్లలు వెనుకటిలాగా ఆటలు పట్టించటం తగ్గించారు. కొళ్ళాయివద్ద స్త్రీలు కూడా యీ మార్పుకు తగ్గట్టుగా కొంత గౌరవము చూపుటకు మొదలుపెట్టారు. మాధవరావుకు యిప్పుడొక మంచి అండ ఏర్పడ్డది. అతనిలో ఒక విధమైన ఆత్మవిశ్వాసము-వికాసము కలిగింది. ఉదాసీనంగా వుండే అతని ముఖంమీద యిప్పుడు మందహాస రేఖ లొక నూతన తేజాన్ని చేకూర్చినయి.

మాధవరావు ఒకరోజు తనగదిలో వంట ప్రయత్నంలో కూర్చొని వున్నాడు. ప్రశాంతత అతని ఉత్సాహాన్ని రేకెత్తించింది. గొంతెత్తి యేదో రాగాలాపనచేస్తున్నాడు. మధురస్వరంలో గానప్రవంతి ఉరకలెత్తుతూవుంటే అతను ఆనంద తన్మయతలోవున్నాడు. సరిగ్గా అదేసమయంలో పార్వతి అతని గదిలోకి వచ్చింది. కాని అతను గమనించలేదు. అతని యీ గంభీర కంఠ మాధుర్యాన్ని విని ఆశ్చర్య చకితురాలైంది. మంత్రముగ్ధలాగా వింటూ నిశ్శబ్దంగా నిల్చున్నది. కాని అతని దృష్టి యీమెపైన పడిన వెంటనే అతను యేదో దెబ్బతిన్నవాడిలాగా లేచి సిగ్గుతో తలవంచుకున్నాడు. అతన్ని యేదో వకరకమైన భయము బిడియము ఆవహించాయి. ఇది చూచి పార్వతి నవ్వుతూ "మాష్టరుగారు-

నేను మిమ్మల్నొక ప్రశ్న అడుగుతాను. సరిగా సమాధానం చెప్తారా?" అని అడిగింది.

మాధవరావు వింతగా చూస్తూ "ఏమో నాకు తెలిసిందైతే చెప్తా" నన్నాడు.

"ఏమీ లేదండి మాష్టరుగారూ—మానవ జీవితంలో యెక్కువ విచారకర విషయ మేమిటో చెపారా?" అని అడిగింది.

ఈ ప్రశ్నకు ఎలా సమాధానం చెప్పాలో అతనికి తోచలేదు. ఆలోచిస్తూ మౌనంగా వుండిపోయాడు. ఇక యెక్కువసేపు అతనిని ఆస్థితిలో వుంచటం యిష్టంలేక పార్వతి "మీకు తెలియకపోతే నేనే చెప్తాను. నా దృష్టిలో అలాంటి విషయ మేమిటంటే యే వ్యక్తి అయినాసరే తనలోవుండే శక్తి సామర్థ్యాలను తెలుసుకోలేక పోవట మేనని తోస్తోంది." అన్నది.

మాధవరావు యీ సమాధానము వినికూడా ఆ ప్రశ్న విన్నప్పుడు యెలా వున్నాడో అలానే స్తబ్దంగా వుండిపోయాడు. అతనికి యీ వివరణకూడా పూర్తిగా బోధపడలేదు. పార్వతివైపు ప్రశ్నార్థకంగా చూస్తూ వూరుకున్నాడు. మళ్లా పార్వతే వివరణ చేసింది "మాష్టరుగారు—మీ అమాయకత్వం చూస్తుంటే నాకు చాల విచారంగా వుంది. ఈ కాలంలో చాలమంది తమలో యేలాంటి శక్తి సామర్థ్యాలు లేకపోయినా తామే సర్వసమర్థులైనట్లు వ్యవహరిస్తుంటే కొందరు తమశక్తి తాము తెలుసుకోలేక అనవసరంగా అవస్థపడుతుంటారు అజ్ఞాతంగా అణగివున్న యిలాటి శక్తులను బహిర్గతము చేసుకొని సక్రమంగా వినియోగించుకుంటే గాని అవి రాణించవు," అన్నది పార్వతి కొంచెం గంభీరంగా.

మాధవరావుకు ఆమె మాటలు యింకా పూర్తిగా అర్థంకాలేదు. ఈమాటు కొంచెం ధైర్యంగా "మీ అభిప్రాయ మేమిటో నాకు సరిగా అర్థం కావటంలేదు. ఇంకా కొంచెం స్పష్టంగా చెప్తే సంతోషిస్తాను," అన్నాడు.

పార్వతి మాధవరావును సమీపించి "మాష్టరుగారూ, నేను ముఖస్తుతిగా మాట్లాడేదాన్ని కాను. మీ మధురకంఠస్వరము విని నేను నిజంగా చాల ఆశ్చర్యపోయాను. ఇంత చక్కని గాత్రాన్ని సరియైన గానసాధనతో మెరుగుపెట్టి దానిని మీ రెందుకు సద్వినియోగ పరచుకోనరాదు?" అని అడిగింది.

మాధవరావుకు యిప్పుడు భయము పూర్తిగా తొలగిపోయింది. "మీరు చెప్పేది బాగానే వున్నది. కాని నాకు గాన సాధనకు తగిన గాత్ర మున్నదా? ఈ రోజున మీరు చెప్పేంతవరకు నా కంఠస్వరం బాగుంటుందని నాకు తెలియదు," అన్నాడు.

"అందుకే నేను చెప్పింది మీ శక్తిసామర్థ్యాలు మీరు తెలుసుకోలేక పోతున్నారని ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. మీరు కొంచెం శ్రద్ధ శ్రమ తీసుకుంటే త్వరలోనే మీకు గాన నైపుణ్యం కలుగుతుంది," అన్నది పార్వతి.

"గానకళ అంటే ఒక్క గాత్రం వుండగానే సరిగాదు దానికి శాస్త్రీయ పద్ధతిలో సక్రమ శిక్షణ, నిరంతర సాధన— అన్నిటికిమించి అవకాశం వుండాలి. అలాంటిది నా బోటి బీద బడి పంతులుకు సాధ్యమా?" అన్నాడు మాధవరావు.

"మాష్టరుగారూ మీరు పెద్దవారు. మీకు ఎక్కువగా చెప్పటం నాకు భావ్యంకాదు. అయినా చెప్పక తప్పదు. అవకాశాల నేవి మనకు వాటంతట అవిరావు. మనమే వాటిని కలుగజేసుకోవాలి కొంత శ్రమ తీసుకుంటే మీకు అలాంటి అవకాశము కలుగుతుంది. మా నాన్నగారికి యిక్కడి సరస్వతీ గాన పాఠశాలవారితో బాగా పరిచయముంది. వారితో చెప్పి మీకు అక్కడ గాన సాధనకు అవకాశం కలుగజేయుమంటాను. మరి మీరుకూడా కొంత శ్రద్ధ తీసుకోవాలి— తెలుసా?" అని పార్వతి అడిగింది.

"మీరు నా హితవుకోరి చెప్తున్నందుకు సంతోషం. కాని యీపని నాకు సాధ్యము కాదేమోనని సంకోచంగావుంది. మరి ఆ పాఠశాలకు జీతం...?" అని మాధవరావు తన అనుమానాన్ని వెల్లడించాడు.

"జీతం విషయంలో మా నాన్నగారు వారితో మాట్లాడి ఏదైనా సదుపాయం కలుగజేస్తారు. కాని మీరుమాత్రం యిలా నిస్పృహతో వుంటే కాదు. ఏ పనైనాసరే పట్టుదలగా సాధ్యమవుతుందని పూనుకొని ధైర్యంగా చేసుకుంటూపోతే అది తప్పకుండా నెరవేరితీరుతుంది. అంతేకాని యీ పని నావల్ల సాధ్యముకాదేమోననే సంకోచంతో చేస్తే అది అలాగే అవుతుంది. అందువల్ల మీరు కొంచెం కష్టపడి అయినా సరే సాధనకు పూనుకోండి. మిగతా అన్ని సంగతులు నేను మా నాన్నగారు చూసాము,"

అని చెప్పి పార్వతి వెళ్ళిపోయింది.

మాధవరావు కొంతసేపు అలాగే ఆశ్చర్యంతో ఆలోచిస్తూ కూర్చున్నాడు.

* * *

వారంరోజుల తర్వాత మాధవరావు సరస్వతీ గానపాఠశాలలో గాన శిక్షణ ప్రారంభించాడు. శాస్త్రిగారి సూచన ననుసరించి పాఠశాలాధికారులు మాధవరావు పరిస్థితికి తగిన వేతన సదుపాయము కలుగజేసారు. సంగీత కళయందుగల అభిమానము వల్ల యెంతో దీక్షగా వుత్సాహంతో కృషిచేసి ఆ పాఠశాలాధికారుల ఆదరాభిమానాలను చూరగొన్నాడు. అచిరకాలంలోనే శాస్త్రీయసంగీతంలో మంచి నైపుణ్యం సంపాదించాడు. సహజ మధుర గాత్రానికి సుశిక్షిత సాధన మంచి వన్నె తెచ్చింది.

ఆ సంవత్సరం పాఠశాల వార్షికోత్సవం జరిగింది. పాఠశాలాధికారులు కార్యక్రమంలో మాధవరావు సంగీతకచేరికూడా యేర్పాటుచేశారు. నగర ప్రముఖులు, గాన కళాభిమానులు చాలామంది యీ వుత్సవానికి వచ్చారు. మాధవరావు గానపాండిత్య మందరిని ముగ్ధులనుచేసింది. పాటకచేరి తర్వాత సభాధ్యక్షుడు మాధవరావు విషయము ప్రస్తావించి స్వల్పకాలములో యింత చక్కని పాండిత్యము పొందినవారి శ్రద్ధాసక్తులు చాల ప్రశంసనీయమని, అట్టివారికి తగిన ప్రోత్సాహము నిచ్చి తమ కళాభిమానము చూపదలచినామనియు, తమకుగల పలుకుబడి నుపయోగించి వీరికి రేడియో కార్యక్రమాలలో అవకాశము కలుగజేసేందుకు ప్రయత్నిస్తామని తెలియజేశారు. పాఠశాలాధికారులు కూడా తమ సంతోషాన్ని వ్యక్తపరుస్తూ మాధవరావుకు ఒక ఫిడేలు బహూకరించారు. అతను వినయపూర్వకంగా దానిని స్వీకరించి తనయందు వారందరు చూపిన ఆదరాభిమానాలకు తన కృతజ్ఞత తెలియచేశాడు. ఈ రోజునుండే మాధవరావు జీవితంలో పురోగమనయాత్ర ప్రారంభమైంది.

ఇప్పుడు తనలోని శక్తిసామర్థ్యాలు ఇత

(43-వ పేజీ చూడండి)

పండిత డి.గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
Diamond 1898 1958 Jubilee
ఆయుర్వేదాశ్రమం(ప్రైవేట్)లిమిటెడ్,
మదరాసు-17.

★ రాళ్లలోని రత్నం ★

(31-వ పేజీ తరువాయి)

రులు తెలుసుకోవటమే కాక తను కూడా తెలుసుకో గలిగాడు. అతని ప్రవర్తనలో, స్వభావములో కూడా చాల మార్పులు వచ్చినవి. ఎప్పుడైనా వుత్సవాల్లోగాని, వివాహ సందర్భాల్లోగాని యితని పాటకచేరీ యేర్పరిస్తే యితను వెళ్ళి తన గాననైపుణ్యాన్ని ప్రదర్శించి ఆశ్రోతల ప్రశంసల నందుకునేవాడు.

అనతికాలంలోనే రేడియో కేంద్రం వారు మాధవరావును ఆహ్వానించి తమ శాస్త్రీయ సంగీత కార్యక్రమాల్లో అవకాశము కలుగజేశారు. స్థానికంగా తను గడించిన సత్కీర్తిని యీ అవకాశములో నలుగడల వ్యాపింపజేసుకున్నాడు. అతని కీర్తి ప్రతిష్ఠలతో పాటు అతని ఆదాయంకూడా బాగా వృద్ధి అయింది. వెనుకటి చిన్నగది వదిలి యిప్పుడొక చక్కని ఇంట్లో నివాస మేర్పరచుకొన్నాడు. తన వుపాధ్యాయ వృత్తినివదలి గానకళకే తన జీవితం అంకితం చేశాడు. ఆ నగరంలో యిప్పుడెక్కడ గొప్ప కార్యక్రమాలు జరిగినా మాధవరావు పాటకచేరీ యేర్పాటు చేయటం ఒక పరిపాటి అయింది. ఇతనికోసం నగర ప్రముఖులు, గానకళాభిమానులు, శ్రీమంతులు తమ్ము కార్లలో యితని ఇంటికే వచ్చి తీసుకొనివెళ్ళి ఆదరిస్తూ వున్నారు. నిన్నమొన్నటివరకు జడుడు, బుద్ధావతారమని హేళనచేసి నిరాదరించినవారే యితనిని యీ రోజున మహాపండితుడు, సమర్థుడని ప్రశంసించసాగారు. అతని జీవితంలో అచిరకాలంలోనే కలిగిన యీ మార్పు అందరిని ఆశ్చర్యచకితులను చేసింది.

'ధనమూలం యిదం జగత్' అనే సామెత మాధవరావు జీవితంలో తన యథార్థతను ఋజువుచేసుకుంది. ఎంత వుత్తముడైనా అతను నిర్ధనుడైతే సంఘమతనిని నిర్లక్ష్యం చేసి, అవహేళన చేసేందుకు వెనుకాడదు. కాని అతనే కొంత ధనమార్జించి, కీర్తి గాంచితే అతనికి బ్రహ్మరథం పట్టి పూజిస్తుంది. అతనిని ఆదరించి ఆరాధిస్తుంది సువర్ణానికి సౌరభమబ్బినట్లు మాధవరావు సహజ సౌశీల్యానికి యీ కీర్తి ప్రతిష్ఠలు దోహదాలై అతని జీవితమార్గాన్ని సుగమమొనర్చాయి. ఇతని స్నేహమాశించి ఆపేటలోని పెద్దలు కొందరు అతనిని తమ అల్లుడుగా చేసుకోవాలని తాపత్రయ పడసాగారు. అతనిని అవమానించి హేళనచేసిన యువతులు కొందరు పశ్చాత్తాప పడి యిప్పుడతని సాహచర్యము వాంఛింప జొచ్చారు. ఇంకా కొందరు శ్రీమంతులు యీ ప్రసిద్ధగాయకునికి గొప్ప కట్నాలిచ్చి తమ కన్యలనిస్తామని వచ్చారు. కాని మాధవరావు ఎవరికి ఎలాంటి సమాధానమియ్యకుండా మౌనం వహించాడు.

ఈ సంగతి సందర్భాలన్నీ శాస్త్రిగారికి పార్వతికి తెలుస్తూనే వున్నయి. మాధవరావు పరిస్థితి, సంపద యిప్పుడు తమ అంతస్తు కన్నా యెన్నోరెట్లు పెరిగిపోయింది. అతని వుచ్ఛదశను, అతని వేషభాషలలో కలిగిన మార్పులను చూచి వారు చాల ఆనందిస్తున్నారు. మాధవరావుకు యిప్పుడు వెనుకటి వలె తీరిక వుండటము లేదు. ఎప్పుడూ యేదో ఒక కార్యక్రమంలో పాల్గొనవలసి వుంటోంది. అయినా అప్పుడప్పుడు వచ్చి వీరిని చూసిపోతూ వుంటేవాడు.

పార్వతి వివాహ సమస్యను గురించి శాస్త్రిగారు ఒకమారు ఆమెతో తన మనస్సులోని అభిప్రాయం వ్యక్తపరచాడు. కాని పార్వతి మాత్రం కొంత సంకోచంతో "నాన్నగారూ-మీ అభిప్రాయానికి నాకేమీ అభ్యంతరం లేదు. కాని యిప్పుడు మావరుగారున్న స్థితిలో మనం వారితో సరితూగగలమా? అయినా వారి అభిప్రాయం యెలావుంటుందో? ఇప్పుడు యెంతోమంది శ్రీమంతులు యెంతైనా కట్నకానుకలిచ్చి పిల్లనిచ్చేందుకు ముందుకువస్తుంటే అటువంటి అవకాశాలన్నీ వదులుకొని మనతోనే కట్టుబడి వుండమని వారిని కోరటం భావ్యంకాదు. మనము వారికి సహాయంచేశామనే కారణంగా యీ విధంగాకోరి వారిని ఒకరకమైన యిరకాటంలో పెట్టి వారి పురోభివృద్ధి మార్గాన్ని అరికట్టటం నాకు యిష్టంలేదు" అని తన ఉద్దేశం తెలియజేసింది.

పార్వతి ఆ వుద్దేశముతోనే మాధవరావుతో వెనుకటిలాగా చనువుగా వుండటం తగ్గించింది. మాధవరావు తమ యింటికి వచ్చినప్పుడుకూడా సాధ్యమైనంత వరకు దూరంగా తప్పుకొనిపోవటం మొదలుపెట్టింది. ఇది అతను కొంత గమనించి ఆమె గృహనిర్వహణభారంతో వుండటంవల్ల అలా వుంటున్నదని భావించాడు.

మాధవరావు ఒక పర్యాయం శాస్త్రిగారింటికి వెళ్లాడు. శాస్త్రిగారు అప్పుడే పని మీద బయటకు వెళ్ళారు. పార్వతి గదిలో కూర్చొని చదువుకుంటోంది. అతన్ని చూడగానే ఆమె లేచి "నాన్నగారు యిప్పుడే బయటకు వెళ్లారు. కూచోండి. ఇంకో అరగంటలో వస్తారని" చెప్పి తానొకమూల దూరంగా నిలబడ్డది. ఇటువంటి పరిస్థితిలో ఆమెను కలుసుకొంటానని అతను అనుకోలేదు ఆమె కొంచెం బిడియం, భయంతో వుండటం చూసి అతను నవ్వుకున్నాడు. తను వంటరిగా వుండగా తనగదికివచ్చి తనను పలుకరించి అతని భయాన్ని సిగ్గును వదలగొట్టిన పార్వతేనా యీమె అనుకొని "ఏమిటి పార్వతీ నన్ను చూసి నీవెందుకు అంత భయపడుతున్నావు? నేను లోకానికి క్రొత్తవాడనైనా నీకుమాత్రం పాతవాణ్ణేగా? అసలు నేను యీ రోజున యింత ఉన్నతస్థితిలో వున్నానంటే దానికంతకు ముఖ్య కారణం నీవేగదా!! ఇక్కడ ఆదరణలేక నిస్సార జీవితం గడుపుతున్న నన్ను ఆదరించి నాలో అణగి వున్న విద్యను గుర్తించి ప్రోత్సహించి నా కీర్తిప్రతిష్ఠలకు ఐశ్వర్యానికి పునాది నీవే వేశావు. నీకు నాయందు వెనుకటి ప్రేమాభిమానాలు, సానుభూతి వున్నాయా? లేకపోతే నీవు నన్ను ధనమదాంధతతో మిమ్మల్ని మరచిపోయేంత నీచునిగా భావిస్తున్నావా? ఈసంగతి నేను సరిగా తెలుసుకోలేకపోతున్నాను" అని ఆవేశపూరితంగా అన్నాడు.

పార్వతికి యిదంతా స్వప్నావస్థలో జరిగిన సంఘటనలాగా తోచింది. సంతోష సంభ్రమాలతో ఆమె చలించిపోయింది. నిరుత్తరురాలైవున్న ఆమె ముఖంలోని ఆనందరేఖలు చూసి మాధవరావు వుత్సాహంతో "పార్వతీ నీకు నాయందు ఎప్పుడూ సదభిప్రాయం వుంటుందని నాకు తెలుసు. నీవు నానుండి దూరంకావటం నేను సహించలేను. నీవు నా జీవితానికి ఒక చక్కనిబాట నేర్పరచావు. ఒంటరిగా ఆ మార్గంలో పోయే శక్తిసామర్థ్యాలు నాకు లేవు. నీ సహకారము, సాహచర్యము లేనిదే నా జీవితాన్ని సుఖప్రదము చేసుకోగలననే ధైర్యముకూడా నాకు లేదు. నా హృదయాన్ని యెప్పుడో నీకు అంకితము చేశాను. ఇంక అక్కడ యెవ్వరికీ తావులేదు. రాయినైనాసరే రత్నంగా మార్చగలిగిన ప్రేమమూర్తివి నీవు. నీకు సమ్మతమైతే మన యిద్దరి జీవితాలను యేకంచేయమని నేను మీ తండ్రిగారిని ప్రార్థిస్తాను" అన్నాడు.

మాధవరావు నోటివెంటవచ్చిన ఈ మాటలు విని పార్వతి ఆనందపరవశురాలైంది. వికసిత వదనంతో "మాస్టరుగారూ — మీకు యేమి సమాధానంచెప్పాలో నాకు తోచటం లేదు. మీ సాహచర్యంకంటే నేను కోరేదేమీ లేదు. నిజానికి నేను రాయిని రత్నంగా మార్చలేదు. కాని రాళ్లలో మరుగుపడిపోయిన రత్నాన్ని వెదికి బయటకు తీశాను. ఈ రత్నం యెప్పుడూ యింత కాంతివంతంగానే రాణించాలనే నేను కోరుకుంటాను" అని మాధవరావు పాదాలకు నమస్కరించింది.

"నీవు చెప్పింది కొంతవరకే నిజం పార్వతీ! రాయిని రత్నమని రత్నమే కనిపెట్టింది, అని మాధవరావు సంతోషంతో నవ్వాడు.

అతని నవ్వుతో పార్వతి తన నవ్వును కూడా కలిపింది. ఆ హృదయపూర్వకహాసం వారిద్దరిహృదయాలను ఏకంచేసింది. ★